# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 05 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. గుంటూరులో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహా సభల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

2. సంక్రాంతి పండుగ పాడిపంటలు, ప్రకృతి, పెద్దల పట్ల గౌరవాన్ని చాటుకొనే గొప్ప ఉత్సవం అని పేర్కొన్న పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

3. రైతులకు రాష్ట్ర రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

4. గన్నవరం విమానాశ్రయం విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేపడుతున్నామన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్.

-----------------------

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహా సభల ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, రాష్ట్ర శాసన సభాపతి సిహెచ్. అయ్యన్నపాత్రుడుతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 20 సెకన్లు

అంతకుముందు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తెలుగు భాష మన మూలాలను తెలియజేస్తుందన్నారు. ఆంగ్లం నేర్పించడంతో పాటు మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని కేంద్రమంత్రి మాట్లాడుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

-----------------------

రైతులకు రాష్ట్ర రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఆగర్రు గ్రామంలో నిర్వహించిన "మీ భూమి మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ యజమానులతో కూడిన ఛాయా చిత్రాలు, వివరాలతో పాటు క్యూ ఆర్ కోడ్ తో ముద్రించిన పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

వాయిస్.. 25 సెకన్లు

-----------------------

సంక్రాంతి పండుగ  పాడిపంటలు, ప్రకృతి, పెద్దలపట్ల గౌరవాన్ని చాటుకొనే గొప్ప ఉత్సవం అని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం తెలుగు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన నిన్న  ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోకుండా పెద్దఎత్తున పండుగలు జరుపుకోవడం అభినందనీయమని చెప్పారు. గాలిపటాలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల వంటి తెలుగు సంప్రదాయాలను  తర్వాతి తరాలకూ పరిచయం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

రాష్ట్రంలో పర్యటిస్తున్న మారిషస్ దేశ అధ్యక్షులు దరంబీర్ గోకుల్ ఈరోజు విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.

-----------------------

గన్నవరం విమానాశ్రయం అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని  విమానాశ్రయానికి  విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా 30.65 కోట్ల రూపాయలతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణలో  భాగంగా గన్నవరం విమానాశ్రయం సమీపంలో విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించామని

చెప్పారు.పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

-----------------------

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీన రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలపై నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఓబన్న జయంతిని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని అనంతపురంలోనూ నిర్వహించనున్నామని తెలిపారు.

-----------------------

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ -వీబీ-జీ-రామ్-జీ పేరిట కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి పథకంపై తిరుపతి జిల్లా శ్రామికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడాన్ని వారు స్వాగతించారు. ఉపాధి హామీ వేతనాలను కూడా పెంచుతూ నిర్ణయం తీసుకోవడం తమకు ఆర్థిక భద్రత కల్పిస్తుందని తిరుపతి జిల్లాకు చెందిన ఉపాధి కూలి సుజాత తెలియజేస్తూ,

(వాయిస్ 17 సెకన్లు)

-----------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కొత్తూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 7వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఓ. సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ మేళాలో 10 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 350 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, చదివిన 18 నుండి 30 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

-----------------------

ప్రతీ ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి సూచించారు. విజయనగరంలోని స్థానిక చింతలవలసలో ఎపిఎస్‌పి 5 వ బెటాలియన్ క్రీడా పోటీలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల వల్ల సమిష్టితత్వం అలవడుతుందని అన్నారు. నిరంతర సాధన ద్వారానే పనిలోనూ, క్రీడల్లోనూ ప్రావీణ్యాన్ని సాధించగలమని చెప్పారు. ప్రతీఏటా క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని, ఇటువంటి పోటీలు బెటాలియన్ సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపుతాయని కలెక్టర్ అన్నారు.

-----------------------

వైయస్సార్ కడప జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ - విబి - జీ రామ్ జీ - 2025" పథకం పై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కడపలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విబి - జీ రామ్ జీ పథకానికి సంబంధించిన గోడ పత్రికలను కలెక్టర్ ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ గ్రామసభల్లో కొత్త పథకంలో మార్పులు, ప్రయోజనాలు వంటి ప్రధాన అంశాలను, ప్రజాప్రతినిధులతోపాటు ఉపాధి కూలీలను ఆహ్వానించి వివరిస్తారమని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =